క్లుప్తంగా

జీవో నెంబర్ 51ను తక్షణమే రద్దు చేయాలి



చింతలపూడిలో మోకాళ్లపై నడిచి నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఐ నాయకులు

దేవరాపల్లి : గిరిజనుల అటవీ భూమి హక్కులను కాలరాసే జీవో నెంబర్ 51ను తక్షణమే రద్దు చేయాలని సీపీఐ జిల్లా సమితి సభ్యుడు, ఏపి ప్రజా నాట్యమండలి జిల్లా ప్రధాన కార్య దర్శి గొర్లి దేముడుబాబు డిమాండ్ చేశారు. మండలంలోని చింతలపూడిలో సీపీఐ మండల కార్యదర్శి వేమల కన్నబాబు ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమంలో గిరిజనులతో కలిసి మోకాళ్లపై నడిచి వినూత్న రీతిలో నిరసన తెలిపారు. అనంతరం సచివాలయ అధికారులకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా దేముడుబాబు, కన్నబాబు మాట్లాడుతూ ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 51తో గిరిజన గ్రామాలకు తీవ్ర నష్టం చేకూరుతుందన్నారు. రైవాడ ప్రాజెక్టుపై ఆధారపడ్డ వేలాది ఎకరాలు బీడుగా మారడంతో పాటు రైతులు, గిరిజనుల మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందన్నారు. ఈ జీవోను రద్దు చేయకుంటే గిరిజనులతో కలిసి ఉద్యమాన్ని ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మూలగుమ్మి సన్యాసిరావు, ఉగ్గిన రాజు, మట్ట దేవుళ్లు, ఉగ్గిన దేవుళ్లు, మూలగుమ్మి గాయిత్రి, ఉగ్గిన నాగమణి, సిరగం గౌరమ్మ, ఉగ్గిన దాలిబాబు పాల్గొన్నారు.

మా జీవనోపాధిని దెబ్బతీయొద్దు



మల్లాంలో భూ సేకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తున్న రైతులు

బుచ్చెయ్యపేట : పరిశ్రమల ఏర్పాటు పేరుతో జీవనోపాధిని పొందుతున్న భూములను లాక్కోవాలని చూస్తే తిరగబడతామని మల్లాం గ్రామస్తులు హెచ్చరించారు. సోమవారం మల్లాం గ్రామస్తులు ఆందోళన చేపట్టి జీవనోపాధిని దెబ్బతీయకండి.. అంటూ భూ సేకరణకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ప్రభుత్వం మల్లాం, ఆర్.భీమవరం, ఆర్. శివరాంపురం, అప్పంపాలెం గ్రామాల మధ్య ఇండస్ట్రియల్‌కి భూములను కేటాయించాలని ప్రయత్నాలు చేస్తుందన్నారు. ప్రభుత్వం భూములు మా నుండి బలవంతంగా భూములను లాక్కోవాలని చూస్తే అడ్డుకుంటామన్నారు. మాకు కూడు పెడుతున్న భూములను లాక్కోవద్దు, మాకు పరిశ్రమలు వద్దు, వ్యవసాయమే ముద్దు అంటూ నినాదాలు చేశారు. వీరికి వామ పక్ష నాయకులు అండగా నిలిచారు.

నేడు వైఎస్సార్‌సీపీ విస్తృతస్థాయి సమావేశం

నర్సీపట్నం: మున్సిపాలిటీ వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని పార్టీ టౌన్ అధ్యక్షుడు ఏకా శివ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. మంగళవారం వేదిక ఫంక్షన్ హాల్ నందు ఉదయం 10 గంటలకు సమావేశం జరుగుతుందన్నారు. ఈ సమావేశానికి మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ హాజరవుతున్నారన్నారు. విస్తృతస్థాయి సమావేశంలో బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమంపై మాజీ ఎమ్మెల్యే దిశా నిర్దేశం చేస్తానన్నారు. మున్సిపాటీలోని కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలన్నారు.

సత్యవరం శివాలయంలో ప్రత్యేక అభిషేకాలు

మాడుగుల : మండలంలో సత్యవరం శివాలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన భక్తులు సుమారు 50 మంది స్వామి వారి అభిషేకాలులో పాల్గొన్నారు. తెల్లవారు నుంచి అభిషేకాల్లో పాల్గొనడానికి భక్తులు క్యూలైన్‌లో బారులు తీరారు.

మాజీ సర్పంచ్ మృతికి సంతాపం



కంటే రామకృష్ణ(ఫైల్)

బుచ్చెయ్యపేట: మండలంలో గల మంగళాపురం మాజీ సర్పంచ్ వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు కంటే రామకృష్ణ (64) మృతి చెందారు. కొద్ది కాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన సోమవారం సాయంత్రం తన ఇంటి వద్ద తుది శ్వాస విడిచారు. రెండుసార్లు సర్పంచ్‌గా, కోఆపరేటివ్ డైరెక్టర్‌గా పదవులు నిర్వహించారు. రాజకీయాలతో పాటు 35 ఏళ్లగా ఆర్ఎంపీ డాక్టర్‌గా ప్రజలకు సేవలందించారు. ఆతని భార్య సుబ్బయమ్మ ఎంపీటీసీగా విధులు నిర్వహించగా, కోడలు కంటే వెంకట పద్మరేఖ ప్రస్తుతం సర్పంచ్‌గా పని చేస్తున్నారు. 40 ఏళ్లగా రాజకీయాల్లో క్రియశీలకంగా వ్యవహరించారు. ఇతనికి భార్యతో పాటు ముగ్గురు కుమారులున్నారు. మంగళవారం ఉదయం మంగళాపురంలో రామకృష్ణ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహిస్తున్నట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఇతని మృతి పట్ల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ చోడవరం సమన్వయకర్త గుడివాడ అమర్‌నాథ్,మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, జెడ్పీటీసీ దొండా రాంబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దన రావు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు సంతాపం వ్యక్తం చేశారు.



మిర్చిలో అంతర పంటగా కాలీఫ్లవర్



బోర్ల నుంచి పుష్కలంగా ప్రవహిస్తున్న నీరు



పందిరిపై పండిస్తున్న బీర కాయలు

కూరగాయల సాగు.. బహుబాగు

- అధిక దిగుబడులు
- రైతులకు అధిక ఆదాయం
- మండలంలో 100 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో సాగు



కూరగాయలు సాగుకు సిద్ధం చేస్తున్న వారు.



విక్రయానికి సిద్ధంగా ఉన్న కాలీఫ్లవర్



పందిరిపై పండిస్తున్న ఆనప కాయలు

నాతవరం: ఒకప్పుడు ఏజెన్సీ ప్రాంతంలో సాగు చేసే కాలీఫ్లవర్ పంటను ఇప్పుడు మైదాన ప్రాంతంలో పుష్కలంగా సాగు చేస్తున్నారు. కాలీఫ్లవర్ మిర్చి అంతర పంటలు సాగుతో అధిక అదాయం పొందుతున్నారు. ఇతర పంటలు సాగు కంటే ఆరుతబడి పంటలు సాగు ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు ఆదాయం వస్తుందని రైతులు చెబుతున్నారు. మండలంలో ములగపూడి ఎ.బెన్నవరం ఎం.బి.పట్నం, మాధవనగరం, నాయుడుపాలెం, గునుపూడి, గుమ్మడిగొండ శృంగవరం, పీకే గూడెం, గంటావారి కొత్తగూడెం, తాండవ, మన్యపురట్ల, లింగంపేట, పెదగొలుగొండపేట, వెదురుపల్లి గ్రామాల్లో 100 ఎకరాలకు పైగా రైతులు కూరగాయలు సాగు చేస్తున్నారు. పందిరిపై ఆగార, ఆనప, బీర, కాకర, వంటి కూరగాయలు పండిస్తున్నారు. కాలీఫ్లవర్ పంట ఏడాదికి మూడుసార్లు వేస్తామంటున్నారు. పంట కాల పరిమితి మూడు నెలలు పాటు ఉంటుంది. పెట్టుబడి ఎకరానికి రూ.30 వేలు ఖర్చు అవుతుంది. ఎకరానికి రూ.10 వేలు కాలీఫ్లవర్ మొక్కలు వేస్తారు. విత్తనాలు కొనుగోలు చేసి వాటిని నారు పోసి మొక్కలు నాడతారు. నీటి సదుపాయం అంతంత మాత్రంగా ఉన్నప్పటికి కాలీఫ్లవర్ పుష్కలంగా పండుతుంది. పంట భూములు వద్దకు వ్యాపారులు వచ్చి కాలీఫ్లవర్ రైతులు వద్ద కొనుగోలు చేసి తీసుకెళ్తుంటారు. సీజన్‌ను బట్టి కాలీఫ్లవర్ రూ.20 నుంచి రూ.30 మధ్య విక్రయాలు చేస్తుంటారు. మిర్చి పంట అయితే ఏడాదికి రూ.లక్షా 50వేలు వరకు ఆదాయం వస్తుందని సాగు రైతులు అంటున్నారు. కాలీఫ్లవర్, మిర్చి తోటలో అంతరపంటగా వేస్తుంటారు. కాలీఫ్లవర్ ఏడాదికి మూడుసార్లు సాగుచేయగా మిర్చిపంట ఏడాదికి రెండు సార్లు సాగు చేస్తుంటారు. మండలంలో ఎగువ ప్రాంతంలో తాండవ ప్రాజక్టు ఉండడంతో వ్యవసాయ బోర్లు నుంచి నీరు పుష్కలంగా రావడంతో కూరగాయల సాగుకు అన్ని విధాలా అనుకూలంగా ఉంది.

కూరగాయల పంటలు సాగు

చేయడంపై రైతులు ప్రత్యేక దృష్టి సారించారు. మండలంలో అధికంగా వరి పంట, చెరకు, జీడిమామిడి పంటలు సాగు చేసేవారు. పాయకరావుపేటలో గల తాండవ షుగర్ ఫ్యాక్టరీ మూసేయడంతో చెరకు సాగు పూర్తిగా మానేశారు. వరి పంటకు సరైన గిట్టుబాటు ధర లేక కూలీల సమస్య కారణంగా గతంతో పోల్చుకుంటే ప్రస్తుతం వరి విస్తీర్ణం గణనీయంగా తగ్గిపోయింది. తగ్గిన పంటలు సాగు విస్తీర్ణంలో బీర, కాకర, వంగ, మిరప, బెండ, ఆనపకాయలు, కొత్తిమీర, చిక్కుడు, టమాటా వంటి కూరగాయల పంటలు రైతులు అధికంగా సాగు చేస్తున్నారు.

ప్రోత్సాహం కరవు

కూరగాయలు పంటలు సాగు రైతులకు కూటమి ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆర్థిక సాయం అందించడం లేదు. గత ప్రభుత్వంలో పందిరిపై కాయకూరలు సాగు చేసే రైతులకు రాయితీ సదుపాయం కల్పించేవారు. ఉద్యావనశాఖ అధికారులు రైతులతో మాట్లాడి ప్రోత్సాహకాలు అందించడం, అవగాహన సదస్సుల ద్వారా రైతులను చైతన్య పరిచేవారు. ఇపుడు ఏడాదిగా అలాంటివి లేవు

దళారుల బెడద

రైతులు పండించిన కాయగూరలను కొనుగోలు చేసే వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రేటు పెరగకుండా చేస్తున్నారు. మండలంలో పండించే కూరగాయలు కొనుగోలు చేసేందుకు కాకినాడ జిల్లా రవతలపూడి, తుని, నర్సీపట్నం ప్రాంతాల నుంచి అధికంగా వ్యాపారులు వస్తున్నారు. ఇక్కడ కొనుగోలు చేసిన కూరగాయలు ప్రత్యేక వాహనాల్లో తరలిస్తుంటారు. వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడి రేటు పెరగకుండా చేస్తున్నారని రైతులు అంటున్నారు.

ఆదాయం బాగుంది



ఇతర వ్యవసాయ పంటలతో పోల్చుకుంటే తక్కువ పెట్టుబడితో అధిక ఆదాయం వస్తుంది. వరి పంట సాగు చేస్తే గిట్టుబాటు కావడం లేదు. అందుకే వ్యవసాయ బోరు నీరు ఆధారంగా కాలీఫ్లవర్, మిర్చి పంటలు, బీర, బెండ వంటి పంటలు సాగు చేస్తున్నాను. కాలీఫ్లవర్‌తో ఏడాదికి ఎకరానికి రూ.లక్ష వస్తుంది. మిర్చి ఎకరానికి రూ.లక్షా50వేలు వస్తుంది. పండించిన పంటలను వ్యాపారులు నేరుగా వచ్చి కొనుగోలు చేస్తున్నారు.

పైల కృష్ణబాబు, రైతు

ప్రభుత్వ మోసాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలి



పార్టీ నాయకులతో కలిసి బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ పోస్టర్లను ఆవిష్కరిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

- మెడికల్ కాలేజీ నిర్మాణానికి స్పీకర్ చొరవ చూపాలి
- మాజీ ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

నర్సీపట్నం : ఈ ప్రాంత ప్రజల కోసం నిర్మించ తలపెట్టిన మెడికల్ కాలేజీని ప్రైవేటు పరం కాకుండా ప్రభుత్వమే నిర్మించేలా స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చొరవ చూపాలని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ కోరారు. మండల కేంద్రమైన మాకవరపాలెంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ...మోసం గ్యారంటీ కార్యక్రమంలో పాల్గొని పార్టీ శ్రేణులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. ఈ ప్రాంత ప్రజలకు కార్పొరేట్‌స్థాయిలో వైద్య సేవలు అందుబాటులోకి తీసుకువచ్చేందుకు, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రూ.500 కోట్ల వ్యయంతో 600 పడకలతో మెడికల్ కాలేజీ నిర్మాణానికి శ్రీకారం చుట్టామన్నారు. 50 శాతం పనులు పూర్తి చేశాం. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఎలాంటి పురోగతి లేదన్నారు. కాలేజీని ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడం వల్ల ప్రజలకు మేలు జరగదన్నారు. ప్రభుత్వమే కాలేజీ నిర్మించేలా స్పీకర్ అయ్యన్నపాత్రుడు చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. యరకన్నపాలెం వద్ద రోడ్డు వేస్తున్న భూమి ఏశాఖదైనా తనకు సంబంధం లేదు, వేసే రోడ్డు అనుమతులతో వేయమంటే పుచ్చ దొంగల్లా టీడీపీ నాయకులు భుజాలు తడుముకుంటున్నారన్నారు. ఈ మండలం టీడీపీకి చెందిన జాతీయ నాయకుడు బాపిరాజు కొత్తపల్లి నుంచి వచ్చిన మాజీ ఎమ్మెల్యేకు ఇక్కడ పరిస్థితులు ఏమి తెలుసునని మాట్లాడుతున్నారు..మీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అల్లిపూడి నుండి వచ్చిన విషయం తెలుసుకోమని మాజీ ఎమ్మెల్యే టీడీపీకి నాయకుడికి కౌంటర్ ఇచ్చారు. కూటమి ప్రభుత్వం ప్రజలకు చేసిన మోసాలను ఎత్తి చూపడమే తమ సమావేశాల ఉద్దేశమన్నారు. ప్రజలకు ఉచిత గ్యాస్ అని చెప్పి ఒకటే సిలిండర్ ఇచ్చారన్నారు. అన్నదాత సుఖీభవ అమలుకు నోచుకోలేదన్నారు. తల్లికి వందనం పథకంలో లబ్ధిదారులకు కోత విధించారన్నారు. సూపర్ సిక్స్ పథకాలను పూర్తిగా గాలికి వదిలేసి, కూటమి నేతలు వేధింపు రాజకీయాలకు పాల్పడుతున్నారన్నారు. అనంతరం బాబు ష్యూరిటీ..మోసం గ్యారంటీ వాల్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో మండల పార్టీ అధ్యక్షుడు చిటికెల రమణ, ఎంపీపీ రుత్తల సర్వేశ్వరరావు, పెట్ల భద్రాచలం, వైస్ఎంపీపీ రుత్తల లక్ష్మి, నియోజకవర్గ పంచాయతీరాజ్ విభాగం అధ్యక్షుడు బొడ్డు గోవిందరావు, మాజీ ఎంపీపీ రుత్తల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ రాజారావు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పీజీఆర్ఎస్‌కు 26 దరఖాస్తులు

- రెవెన్యూ సమస్యలే అధికం
- అర్జీలు స్వీకరించిన ఆర్డీవో



ఫిర్యాదుదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న ఆర్డీవో రమణ

నర్సీపట్నం : ఆర్డీవో కార్యాలయంలో సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో వి.వి.రమణ ఆర్జీదారుల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. సుమారు 26 వరకు వచ్చిన ఫిర్యాదుల్లో అధికంగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయి. ఇంటిపై ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లను తొలగించాలని కోరుతూ మున్సిపాలిటీ 3వ వార్డుకు చెందిన మజ్జి సత్యవేణి ఆర్డీవోకు ఆర్జీ పెట్టుకోగా, సాగులో ఉన్న డి-పట్టా భూమికి పట్టాదారు పుస్తకం మంజూరు చేయాలని కోరుతూ నాతవరంకు చెందిన చంటమ్మ దరఖాస్తు చేసుకున్నారు. రోలుగుంట మండలం, అర్ల గిరిజన పంచాయతీ ఎంపీపీ స్కూల్‌లో ఇటీవల జరిగిన తల్లిదండ్రుల సమావేశంలో విద్యార్థి తల్లిపై అసభ్యకరంగా బూతులు మాట్లాడిన హెచ్ఎం బి.రాముపై తక్షణమే చర్యలు తీసుకోవాలని స్కూల్ తల్లిదండ్రుల కమిటీ సభ్యులు ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు.

అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించాలి



కె.కోటపాడులో పీవోకు వినతిపత్రం అందిస్తున్న అంగన్‌వాడీలు



మాడుగులలో పీవోకు వినతి పత్రం అందజేస్తున్న అంగన్‌వాడీలు

కె.కోటపాడు/మాడుగుల/రావికమతం: గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎఫ్ఆర్ఎస్ విధానం ద్వారా సరుకులను అందించడాన్ని రద్దు చేయాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షురాలు జి.కుమారి అన్నారు. ఎఫ్ఆర్ఎస్‌ను రద్దు చేయాలని కోరుతూ కె.కోటపాడులో ఐసీడీఎస్ సీడీపీవో లలితకుమారికి సోమవారం వినతిపత్రం అందించారు. అంగన్‌వాడీ ఉద్యోగులు వరలక్ష్మి, పి.భవాని, రమణమ్మ, లక్ష్మి పాల్గొన్నారు. ఏజెన్సీలో సిగ్నల్స్ లేక పోవడం వల్ల ఎఫ్ఆర్ఎస్ విధానం అమలు చేయడంలో అంగన్‌వాడీ ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. గతంలో ఇచ్చిన 2 జి మొబైల్స్ ప్రస్తుతం పని చేయలేదని, ప్రభుత్వం 5 జి సెల్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. మాడుగుల ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అంగన్‌వాడీ యూనియన్ సీఐటీయు, ప్రాజెక్టు నాయకులు జానకి, రామలక్ష్మి ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. పీవోకు వినతి పత్రం అందజేశారు. రావికమతం ప్రాజెక్ట్ కార్యా ల యం వద్ద అంగన్‌వాడీలు సోమవారం ధర్నా నిర్వహించారు. అంగన్‌వాడీలపై పనిభారం తగ్గించి పాత పద్ధతే కొనసాగించాలని డిమాండ్ చేశారు. అధ్యక్షురాలు పి. వరలక్ష్మ, ప్రధాన కార్యదర్శి ఎస్.సత్యవేణి, సీఐటీయు మండల కన్వీనర్ వి.సత్యవతి పాల్గొన్నారు.

ఘనంగా ముగిసిన మోదమాంబ జాతర

అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు



శేణి వద్ద బుర్రకథ ప్రదర్శన

మాడుగుల రూరల్: కె.జె.పురం మోదమాంబ జాతర ఆదివారం అర్ధరాత్రి వరకు జరిగింది. ఈ సందర్భంగా గ్రామంలో పలు చోట్ల సాంస్కృతిక కార్యక్రమాలు సందడిగా జరిగాయి. గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. స్థానిక కళావేదిక మీద ప్రదర్శించిన సాయి ఈవెంట్స్ వారి నృత్య ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. జబర్దస్ట్ టీమ్‌లో అదుర్స్ సినిమా నటుడు రఘుతో పాటు పల్సర్ బైక్ ఝాన్సీ, సుమన్‌శెట్టి, శాంతి స్వరూప్, రమేష్ మాస్టరు సందడి చేశారు. ఈ సందర్భంగా సినీ కళాకారుడు రఘు నన్ను ఇడ్చేయా.. అన్న బందర్‌కు పోతా, అన్న డైలాగు వినిపించారు. అలాగే గ్రామంలో గాంధీ వీధి యూత్ ఆధ్వర్యంలో, గణేష్ షాపు వద్ద కాలనీలో నృత్య కార్యక్రమాలు అలరించాయి. దీంతో పాటు శేణి వద్ద బుర్రకథ అందరిని ఆలరించింది. జాతర సందర్భంగా ఎటువంటి అవాంఛనీ య సంఘటనలు జరగకుండా ఎస్ఐ జి.నారాయణరావు, సీఐ పైడిపునాయుడు సారథ్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాట్లు చేశారు. వర్షాన్ని కూడా లెక్క చేయకుండా జనం ఉత్సవంలో పాల్గొని విజయవంతం చేశారు. ఉత్సవ కమిటీ చైర్మన్ రాపేట జోగినాయుడు, వైస్ చైర్మన్ రాపేట రాజశేఖర్‌నాయుడు, గౌరవ అధ్యక్షుడు, సర్పంచ్ జామి రమణబాబు, శాశ్వత కమిటీ అధ్యక్షుడు బొడ్డేడ సురేష్, ఇతర కమిటీ సభ్యులు పర్యవేక్షించారు.

ఐటీఐలో మిగులు సీట్లకు రెండవ విడత కౌన్సెలింగ్

నర్సీపట్నం : ప్రభుత్వ ఐటీఐలో మిగులు సీట్లకు రెండవ విడత ప్రవేశాలకు ఈ నెల 23న కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ప్రిన్సిపాల్ ఎల్.గౌరీమణి తెలిపారు. విద్యార్థులు ముందుగా వైబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలన్నారు. ఐటీఐలో సర్టిఫికేట్లు వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. రిజిస్ట్రేషన్ చేయించుకున్న విద్యార్థులు ఈ నెల 23న ఉదయం 9 గంటలకు ఐటీఐలో హాజరు కావాలని ప్రిన్సిపాల్ సూచించారు.

కె.జగన్నాథపురంలో సంచార వైద్యసేవలు

కె.కోటపాడు : మండలంలో కొరువాడ జగన్నాథపురం గ్రామంలో సోమవారం లంకవానిపాలెం పీహెచ్‌సీ వైద్య సిబ్బంది సంచార వైద్య సేవలో భాగంగా వైద్య పరీక్షలను నిర్వహించారు. 89 మందికి సాధారణ వైద్యంతో పాటు బి.పి, సుగర్ పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. గర్భిణులకు వైద్యాధికారి శైలజ ఆరోగ్య తనిఖీలు నిర్వహించి జాగ్రత్తలు సూచించారు. ఏఎన్ఎం, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్

మునగపాక: మునగపాక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మంగళవారం జాతీయ ఉపాధి హామీ పథకం సోషల్ ఆడిట్ నిర్వహించనున్నట్టు ఏపీవో శివ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటలకు ఆడిట్ ప్రారంభమవుతుందన్నారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు ఈ కార్యక్రమానికి తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం తగదు



15వ ఆర్థిక సంఘం నిధుల విడుదల కోరుతూ ఎమ్మెల్యే బండారుకు వినతి పత్రం అందిస్తున్న సర్పంచ్‌లు

దేవరాపల్లి: మండల సర్వ సభ్య సమావేశంలో సభ్యులు ప్రస్తావించిన సమస్యలు పరిష్కరించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవరిస్తున్నారని పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ బుల్లిలక్ష్మి అధ్యక్షతన సోమవారం జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు. బోయిలకింతాడ సర్పంచ్ బాబూరావు మాట్లా డుతూ తమ పంచాయతీలో ప్రాథమిక పాఠశాల స్థలం 9 సెంట్లు ఆక్రమణకు గురైందని, బోయిలకింతాడ కొత్తూరులో ప్రాథమిక పాఠశాల ప్రహరీ, మంచినీటి ట్యాంక్ నిర్మాణానికి నిధులు మంజూరైనా స్థానికులు కొందరు అడ్డగించడంతో పనులు నిలిచిపోయాయన్నారు. దీనిపై ఎమ్మెల్యే బండారు స్పందించి తక్షణమే పాఠశాల ఆక్రమణలు తొలగించి, ప్రహరీ, ట్యాంక్ నిర్మాణ పనులను ప్రారంభింప చేయాలని అధికారులను ఆదేశించారు. ఏ.కొత్తపల్లి హైస్కూల్‌లో తాగునీటి సదుపాయం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, పాఠశాలకు ప్రహరీ నిర్మించాలని సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ తెలిపారు. వెలుగు, ఉపాధి హామీ, ఐసీడీఎస్ అధికారులు గ్రామాల్లో చేపట్టే కార్యక్రమాలకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు కనీస సమాచారం ఇవ్వకుండా ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని జెడ్పీటీసీ కర్రి సత్యం ఆగ్రహం వ్యక్తం చేశారు. వెలుగు వీవోఏలు గ్రామాలలో ప్రభుత్వ కార్యాలయాల్లోకి రాకుండా మహిళలను తన ఇళ్లకు రప్పించుకుంటూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఎ.కొత్తపల్లి సర్పంచ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. దీనిపై ఎమ్మెల్యే స్పందిస్తూ గ్రామాల్లో ప్రతి కార్యక్రమానికి ప్రజాప్రతినిధులకు సమాచారం ఇవ్వాల్సిందేనని, వీవోఏలు ప్రభుత్వ కార్యాలయా ల్లో మాత్రమే విధులు నిర్వర్తించాలని, ఇంటికి రప్పించుకుంటే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వైద్య సిబ్బంది మధ్య సమన్వయం లోపిస్తుందని వైస్ ఎంపీపీ పంచాడ సింహాచలంనాయుడు లేవనెత్తారు. అనంతరం పంచాయతీలకు 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదల చేయాలని, సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు పెండింగ్‌లో ఉన్న గౌరవ వేతనం బకాయిలను చెల్లించాలని సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఎమ్మెల్యేకు వినతి పత్రాలను అందజేశారు. సమావేశంలో జెడ్పీటీసీ కర్రి సత్యం, వైస్ ఎంపీపీ సింహాచలంనాయుడు, గంగాభవానీ, ఎంపీడీవో సువర్ణరాజు, తహసీల్దార్ పి.లక్ష్మీదేవి, పరిపాలన అధికారి లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాడి రైతులకు అండగా విశాఖ డెయిరీ



సమావేశంలో బీమా చెక్కులు అందజేస్తున్న విశాఖ డెయిరీ డైరెక్టర్ గంగాధర్

కె.కోటపాడు : పాడి సభ్య రైతులకు విశాఖ డెయిరీ ఎల్లప్పుడూ అండగా ఉంటూ తోడ్పాటును అందించనున్నట్టు విశాఖడెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ అన్నారు. చౌడువాడ విశాఖడెయిరీ జనరల్ బాడీ సమావేశాన్ని సొసైటీ అధ్యక్షుడు కోమార వెంకటరమణ(పీర్‌లెస్) ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న విశాఖ డెయిరీ డైరెక్టర్ సుందరపు గంగాధర్ మాట్లాడుతూ సభ్య రైతులతో పాటు పాడి పశువులకు బీమా సదుపాయం విశాఖ డెయిరీ కల్పిస్తున్నట్టు ఆయన తెలిపారు. సభ్య రైతు, పశువుకు కేవలం 33 శాతం బీమా నగదును రైతు చెల్లిస్తే, మిగిలిన బీమా నగదు విశాఖ డెయిరీతో పాటు స్థానిక సొసైటీ చెల్లిస్తుందని తెలిపారు. ఈ బీమా కలిగిన 58 ఏళ్ల వయస్సులోపు గల వారు చనిపోతే లక్ష రూపాయలు, 60 ఏళ్ళు దాటిన వారు మరణిస్తే రూ.30 వేల బీమా నగదును ఇవ్వడం జరుగుతుందన్నారు. వీటితో పాటు విశాఖ డెయిరీ ద్వారా పశువులను కొనుగోలు చేస్తే వడ్డీ లేని రుణం మంజూరుతో పాటు రూ.10వేల రాయితీని వర్తింపజేస్తున్నట్టు గంగాధర్ తెలిపారు. ఈ సందర్భంగా మృతిచెందిన నలుగురు రైతుల కుటుంబాలతో పాటు పశువు మృతి చెందిన పాడిరైతు కుటుంబానికి కలిపి రూ.లక్షా 37వేల బీమా నగదును అందించారు. కార్యక్రమంలో పాల సంఘం అధ్యక్షుడు కోమార వెంకటరమణ(పీర్‌లెస్), వేతన కార్యదర్శి చిన్ని వెంకట నర్సింహమూర్తి, సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ ఏటుకూరి రాజేష్, మాజీ గోవాడ సుగర్ ఫ్యాక్టరీ డైరెక్టర్ రాజి శ్రీనివాసరావు, మాజీ పాల సంఘం అధ్యక్షుడు కోమార ఎర్రునాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు రాజి నారాయణమూర్తి(నాని) పాల్గొన్నారు.

పలు గ్రామాల్లో భారీ వర్షం



చోడవరంలో కురుస్తున్న వర్షానికి రోడ్లపై నిలిచిపోయిన నీరు



బుచ్చెయ్యపేటలో కురిసిన వర్షంతో ఎర్ర నీటితో ప్రవహిస్తున్న గుర్రపుగెడ్డ

చోడవరం: చోడవరంతో పాటు పరిసరాల్లో సోమవారం భారీ వర్షం కురిసింది. భారీ వర్షాలకు చోడవరం పరిసరాల్లో గత మూడు రోజుల్లో 54 మిల్లీ మీటర్లు వర్షం కురవగా సోమవారం ఒక్కరోజే 18 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. ఉదయం, రాత్రి తేడా లేకుండా వర్షం ఏకధాటిగా ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తుండడంతో పొలాల్లో భారీగా వర్షపునీరు చేరింది. ప్రధానంగా బీఎన్‌రోడ్డుపై పెద్దపెద్ద గోతులు ఉండడంతో వర్షపునీరు చేరి రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా మారింది. మరో పక్క ఈదురుగాలులకు విద్యుత్‌కు కొంతమేర అంతరాయం కలిగింది. ఈ వర్షాలు వరి నారుకు మేలు చేశాయి.

బుచ్చెయ్యపేట : మండలంలో కురిసిన వర్షంతో వరి ఆకుమడులతో పాటు పలు రకాల అపరాల పంటలు, కూరగాయ పంటలకు మేలు చేసింది. మినుము, పెసర, కంది, గంటి, నువ్వు, బొబ్బరి తదితర అపరాల పంటలు సోమవారం కురిసిన వర్షానికి ఊపిరి పోసుకున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో వర్షం నీరు చేరడంతో పాటు గెడ్డలు,నదులు వర్షం నీటితో ప్రవహించాయి.

కె.కోటపాడు : మండలంలో పలు గ్రామాల్లో సోమవారం మధ్యాహ్నం భారీ వర్షం కురిసింది. కె.కోటపాడు, చౌడువాడ, గొండుపాలెం, గుల్లేపల్లి తదితర గ్రామాల్లో మధ్యాహ్నం 3 గంటల నుంచి 5 గంటల వరకూ వర్షం పడడంతో సాగునీటి చెరువుల్లోకి వర్షపునీరు పెద్ద ఎత్తున చేరుకుంది.